# తిలోదకం

వి. కృష్ణమూర్తి

వెండి మబ్బులు పొదిగిన నీలాకాశంతో రంగు పొత్తు కుదరక ఆ ఊరి వెలుపల ఆకుపచ్చని వరిపొలాలు ఊగిపోతున్నాయి. ఆ ఊరికెళ్ళేదారికి మరోవైపున అక్కడక్కడ కొన్ని గుడిసెలు, కొంత దూరంలో ఒక చిన్న గుట్టపై శివాలయం. ప్రకృతి పులకిస్తున్న ఆ ఊళ్ళో పెంకుటిళ్ళతో క్రిక్కిరిసివున్న ఒక వీధి—అడపా దడపా పడుతున్న చినుకుల కారణంగా మట్టివాసన కొడుతున్న ఆ వీధిలో ఒక పెంకుటిల్లు–కొన్ని పెంకులూడిపోయినా పునాదులు గట్టివి కావడంవల్ల గోడలలో చీలికలు మాత్రమే కనిపిస్తున్న ఆ యింటి మధ్య గదిలో ఒక పాతకాలపు వెదురు కుర్చీ–ఆ కుర్చీలో ఇరవై ఏళ్ళ ఓ అమ్మాయి. గుండ్రని ముఖానికి తీర్చిదిద్దిన కళ్ళు, ముక్కు, ఎర్రని లేత పెదవులు, మెడలో నీలిరాయి పొదిగిన లాకెట్‌తో మామిడిచైను, చెవులకు రింగులు, నుదుట గుండ్రని ఎరుపు తిలకం, తలంటుకొన్న పొడిజుత్తు – వీటితో బాటు చామనచాయగా, సన్నగా, పరువం పొంగుల వంపులతో తీరిన ఆ అమ్మాయి పేరు ప్రభావతి. ఊదారంగు సాటిన్ జాకెట్‌పై ఎర్రచుక్కల పసుపుచీర కున్న పసుపు చుక్కల ఎర్రరంగు బార్డర్‌ని కుడిచేతి వేళ్ళ మధ్య ఊపుతూ తాపీగా కూర్చున్నట్లు కనిపిస్తూంది కాని నిజానికామె ఏదో ముఖ్యమైన ఆలోచనలో మునిగివుండాలి. లేదా దేనికోసమైనా, కాకుంటే ఎవరికోసమైనా, ఎదురు చూస్తుండాలి. లేకపోతే కొత్తగా తెచ్చుకున్న కథల పుస్తకాలు, నవలలు పక్కన పడేసి ఖాళీగా కూర్చోగలదా? మౌనంగా ఉండగలదా? మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటిపోయినా యింకా ఎందుకు భోజనం చేయలేదు? తరచు తన రిస్ట్‌వాచ్‌వైపు ఎందుకు చూసుకుంటుంది? బహుశా తన ఎడమచేతిపై తళతళ మెరిసే ఆ గోల్డ్ కవర్డ్ స్క్వేర్ రిస్ట్ వాచ్ కొత్తగా కొన్నదా అనుకుంటే అదీకాదు. దాన్ని ఆరేడు నెలల క్రితం ఉగాదినాడు తన క్లాస్‌మేట్ భాసమూర్తి తనకు కానుకగా యిచ్చాడు.

ఆ గది మూలలో వాలుకుర్చీపై ప్రభావతి వాళ్ళ నాన్న పెంచలయ్య కూర్చుని వున్నాడు. చేతికర్రను నేల మీద వుంచి, కండువాను కుర్చీ చేతి రెక్కలమీద వేసి వెనక్కివాలి కోడి నిద్ర పోతున్నాడు. అప్పుడప్పుడు "ఇక నీవు భోజనం చేయమ్మా" అని ప్రభావతితో అంటున్నాడు.

రోడ్డుపై ఏదో అలికిడి వింది. తడి రోడ్డుపై సైకిల్ వస్తున్నట్టు విని ప్రభావతి లేచి నిలబడింది. తన కుడి

ఛాతీపై విశ్రాంతి తీసుకుంటున్న మెత్తని జుత్తును వెనక్కి వీపుమీదకి విదిలి చుకుని, పొడి కేశాలకు చుట్టిన రబ్బరు బాండును మెడదాకా తోసింది. సైకిల్ గంట వినబడడంతో ఆమె పైట కప్పుకుని గుమ్మంవైపు వెళ్ళి చూసింది. పోస్టుమాన్ వెళ్ళిపోతున్నాడు. అంటే తనకు ఉత్తరం రాలేదన్నమాట. తల దించుకొని ఎడమచేతి చూపుడువేలితో కుడి పెదవి పైభాగానవున్న పులిపిరి కాయను నిమురుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది. దేవుడి దీపంలో నూనె పోసి, రెండు అగరువత్తులను వెలిగించింది. జాజి వాసనతో ధూపం వ్యాపించింది. ఒక గ్లాసుతో మంచినీళ్ళు ము చి తాగి మళ్ళీ వచ్చి గదిలో కూర్చుంది. ఇదంతా జాలిగా గమనిస్తూవున్న పెంచలయ్య "అన్నం పెట్టుకుతినమ్మా! చాలా ప్రొద్దయింది" అన్నాడు రెండు చేతులూ పైకెత్తి వాలుకుర్చీలో వెనక్కి వాలుతూ.

"రెండుగంటల పోస్టుచూసి భోజనం చేస్తాలే, నాన్నా" అంటూ రిస్ట్‌వాచ్ వైపు చూసుకుంది ప్రభావతి.

"నీది వట్టి భ్రమతల్లీ! ఏమాత్రం అభిప్రాయంవున్నా ఈ పాటికే ఉత్తరం వ్రాసి ఉండేవాడు" అని పెంచలయ్య తన అరవైయేళ్ళ లోకానుభవాన్ని నెమరువేశాడు.

"ఇతను అందరిలా కాదు నాన్నా! ఎప్పుడో వాళ్ళ నాన్నకు వివరంగా వ్రాశాడట. జవాబు రాలేదని తానే శ్వయంగా విజయవాడకు వెళ్ళాడు. చాదస్తపు బ్రాహ్మలు కదా, మంచిరోజు చూసి కాని వ్రాయరు." తాను ప్రేమించిన భానుమూర్తిని వెనకేసుకొస్తూ ప్రభావతి వంటింట్లోకి వెళ్ళి, మళ్ళీ ఒక గ్లాసు మంచినీళ్ళు తాగి గదిలోకి వచ్చింది.

ఏదో గుర్తొచ్చి, పెంచలయ్య లేచి నిల్చున్నాడు. చొక్కా తొడుక్కొని చేతికర్ర అందుకున్నాడు. చెప్పులేసుకుంటూ "నేనలా లైబ్రరీదాక వెళ్లొస్తానమ్మా! జాగ్రత్తగా వుండు" అంటూ రోడ్డుమీదకి నడిచాడు.

"మబ్బులు ముసురుకొస్తున్నాయి. పెద్దవర్షం పడేలాగుంది. గొడుగు తీసుకెళ్ళు నాన్నా!" అని ప్రభావతి గుమ్మందాకా వెళ్ళి గొడుగందించి, చేతికర్రను తీసుకుంది. పెంచలయ్య వెళ్ళినవైపే చూస్తూ నిలబడింది.

చిన్నప్పుడే తన తల్లి చనిపోయింది. ఆమె లేనిలోటు తెలియనీకుండా తనను నాన్నే పెంచాడు. ఆయన్ను వేధిస్తున్న సమస్య ఇప్పుడొక్కటే. ఆలస్యంగా పుట్టిన ఒక్కగానొక్క కూతురు ప్రభావతిని ఒక ఇంటిదాన్ని చేయటమే. దైవవశాత్తుగా భానుమూర్తి, ప్రభావతి ప్రేమించుకోవడం, అతను తనను తప్ప ఇంకెవరినీ పెళ్ళి చేసుకోనని ప్రభావతికి

మాటఇవ్వడంజరిగిపోయాయి. ఈ పెళ్ళికి భానుమూర్తి వాళ్ళ నాన్న కూడా ఒప్పుకుంటే ఇక పెంచలయ్య బాధ్యత పూర్తిగా తీరిపోయినట్లే.

కుర్చీలో కునుకుతీస్తున్న ప్రభావతికి "పోస్ట్!" అన్న కేక వినడంతో మెలకువ వచ్చింది. బయట పెద్ద వర్షం పడుతోంది. లేచి వెళ్ళి ప్రభావతి ఉత్తరాన్ని అందుకుంటూ రోడ్డువైపు చూసింది. అప్పుడే వర్షం ప్రారంభమైనట్లుంది, జనం అటూ యిటూ పరుగెడుతున్నారు. వచ్చిన ఇన్‌లాండ్ లెటర్ని వెనక్కి తిప్పి చూసింది. 'భానుమూర్తి, విజయవాడ' అన్న అడ్రసు కనిపించింది. గడియారం మూడున్నర గంటలు చూపిస్తోంది. హాయిగా వాలుకుర్చీలో కూర్చుని, ఉత్తరాన్ని చింపి చదవడం ప్రారంభించింది.

"మైడియర్ ప్రభా!


నే నీ ఊరికి వచ్చేసరికి మా నాన్న పొరుగూరికి వెళ్ళాడని తెలిసింది. మా అమ్మద్వారా కొన్ని విషయాలు తెలుసుకున్నాను. నా ఉత్తరం చేరిందట. అప్పటికే మా నాన్న నాకో సంబంధం కుదిర్చారట. ముహూర్తం కూడా నిర్ణయించి, అక్కడికొచ్చి నన్ను పిల్చుకు రావాలనికూడా ఆయన అనుకున్నారట. మా నాన్న సంగతి నీకు చెప్పానుగా, ఆయన నిర్ణయాన్ని సులభంగా మార్చలేం. కనుక ఇక మన పెళ్ళి ప్రసక్తి లేనేలేదని మా అమ్మ నీకు వ్రాయమంది. నీవు బాధపడకు. ఇంకెవరినైనా చేసుకుని హాయిగా వుండు. ప్రస్తుతం ఇంతకంటే వేరే మార్గంలేదు. అన్నట్లు నాకు యీ ఊళ్ళోనే ఉద్యోగం దొరికింది. సెలవు దొరకగానే అక్కడికొచ్చి వివరాలన్నీ చెప్తాను. నన్ను క్షమించి మరిచిపోవలసింది.

ఇట్లు — భాను"

ప్రభావతి చేతిలోనుంచి ఉత్తరం జారిపోయింది. కుర్చీ వెనక్కి వాలుతూ కళ్ళు మూసుకుంది. ఒక్కసారిగా పదునైన కత్తితో తల నరికేసినట్లయింది ఆమెకు.

'హుం, ఎంత తేలికగా రాసేశాడు! ఈ మగజాతి గుణం ఇంతే కాబోలు, ఛీ!' అని ప్రభావతి అసహ్యించుకుంది. ఇప్పుడు నాన్నకేం చెప్పాలి? ఇన్ని రోజులూ తన పెళ్ళిగురించి ఆయన ప్రయత్నమే చేయనక్కరలేదని చెపుతూ వచ్చింది, గర్వంగా. ఆయన భరించగలడా? చెప్పులరిగిపోయేలా ఆయన్ను తిప్పాల్సిందేనా? ఉహుం, అలా జరగడానికి వీల్లేదు. తనే ఒక సంబంధం తెచ్చుకోవాలి.

ఆలోచనలతో ప్రభావతి బుర్ర వేడెక్కిపోతోంది. క్రమంగా ఆమెలో అగ్నిగుండం రేగి అది బద్దలై పెనుతుఫానుగా మారింది.



అందుకు ప్రత్యక్ష సాక్ష్యమా అన్నట్లు దట్టమైన మేఘాలు ఆకాశంలో వ్యాపించి కుంభవృష్టిని కురిపించసాగాయి. పై కప్పులు, తడికెలు కొట్టుకువచ్చి రోడ్డు మీద పడుతున్నాయి.

మూడు గంటలసేపు ఏకధాటిగా కురిసిన వర్షం క్రమంగా తగ్గడం ప్రారంభించింది. రోడ్లన్నీ నీటిమయం కాగా బండ్ల రాకపోకలు ఆగిపోయాయి. వర్షంలో చిక్కి అక్కడక్కడ ఆగిపోయినవాళ్ళు చినుకులను లెక్కచేయక నడిచి వెళ్తున్నారు.

చీకటి పడుతోంది. పెంచలయ్య తిరిగి రాలేదు.ఎక్కడో వర్షానికాగివుండాలి,లేదా యింటివైపే వస్తుండాలి.

బాగా చీకటి పడిపోయింది. స్ట్రీట్ లైట్స్ వెలగడం మానేశాయి. మోకాలి లోతు నీళ్ళలో వచ్చేపోయేవాళ్ళు నడుస్తున్న బుడబుడ శబ్దం, 'జాగ్రత్త' అన్న అరుపులు, అప్పుడప్పుడు ఆకాశంలోని ఉరుములు తప్ప వేరే శబ్దాలు వినిపించటంలేదు.

మళ్ళీ కుంభవృష్టి! ఉరుములు, మెఱుపులతో ఆకాశం ప్రళయతాండవం చేస్తోంది. నడుస్తున్న జనమంతా చెల్లాచెదరై పోతున్నారు.

ఇంట్లో లైట్లు మినుకు మినుకుమంటున్నాయి. ఆ కరరెటు కాస్తా ఆగిపోతుందేమో! రెండు కొవ్వొత్తులు వెలిగించి దిగులుగా వెదురు కుర్చీలో కూర్చుంది ప్రభావతి.

ఏ ప్రమాదం ముంచుకొస్తుందేమోనని ఆమెకు భయంవేస్తోంది. ఒకవైపు ఏకధాటిగా వర్షం, మరోవైపు పెంచ

లయ్యే తిరిగి రాకపోవడం, మూడో వైపు వెన్నుపోటులా భానుమూర్తి వ్రాసిన ఉత్తరం.

చలిగాలికి వణుకుతూ ఎవరో వచ్చి వసారాలో నిలిచారు.

"నాన్నా!" అని పిలిచింది ప్రభావతి. జవాబు రాలేదు. మళ్ళీ పిలిచింది.

"వర్షానికాగానమ్మా" అని జవాబిచ్చింది ఓ పురుషకంఠం.

మసక చీకటిలో అతన్ని చూసింది ప్రభావతి. అయన వయస్సు యాభై, అరవై మధ్య వుంటుంది. చేతిలో గొడుగున్నా వాడలేకపోతున్నాడు. తుఫాను గాలులకు ఊగిపోతున్నాడు.

"లోపల కుర్చీలో కూర్చోండి, గాలివాన ఎక్కువైంది" అంటూ ప్రభావతి అయన్ను లోపలికి పిలిచింది.

"ఫరవాలేదమ్మా! కాస్సేపే గా!" అని అయన వసారాలోనే వణుకుతూ నిల్చున్నాడు.

ఎక్కడో తీగలు తెగినట్లున్నాయి. ఇంట్లో కరెంటు కాస్తా పోయింది. గాలికి కొవ్వొత్తులు అరిపోకుండా వాటికి రెండు చెక్కలు అడ్డంగా నిలిపింది ప్రభావతి.

"అగ్గిపెట్టె దగ్గరుంచమ్మా, కొవ్వొత్తులు నిలిచేలా లేవు" అని హెచ్చరించాడు ఆ పెద్దమనిషి.

అగ్గిపెట్టెకోసం వంటింట్లోకి వెళ్ళిన ప్రభావతి 'కెవ్వు'మని కేకవేసి గదిలోకి వచ్చేసింది.

ఇంటి లోపలి భాగం పూర్తిగా కూలిపోయింది. వెలుగుతున్న రెండు కొవ్వొత్తులు కూడా అరిపోయాయి. చీకట్లో కళ్ళు పొడుచుకుని చూసినా ఏమీ కనిపించడంలేదు.

"ఏమయిందమ్మా?" అత్రంగా అడిగాడు అ పెద్దాయన.

"వంటింటి గోడలు పడిపోయాయండీ! నాకు భయంవేస్తోంది. మా నాన్నగారుకూడా ఇంట్లోలేరు." వణుకుతూ బదులిచ్చింది ప్రభావతి.

"జాగ్రత్త తల్లీ!" అన్నాడాయన, తానుకూడా ఆ పరిస్థితులకు భయపడుతూ."

ఉన్నట్లుండి ఒక పెద్దమెరుపు మెరిసింది. కొన్ని క్షణాలలో భయకరంగా పిడుగుపాటు శబ్దం. దూరంలో ఎక్కడో పిడుగుపడింది. ఆ శబ్దానికి అదిరికాబోలు మధ్యగది కూడా కూలిపోయింది.

"బాబోయ్!" అని పెద్దగా కేకేసి ప్రభావతి వసారాలో కొచ్చి అయన్ను గట్టిగా వాటేసుకుంది.

"మా యిల్లు కూలిపోయిందండోయ్!" అని గట్టిగా ఏడవసాగింది.

"ధైర్యంగా ఉండాలి తల్లీ!" ఆయన ప్రభావతి తలను నిమిరాడు. "ఇక్కడ ఉండొద్దమ్మా! ఈ వసారాకూడా కూలిపోయేలా...." అనబోతుండగా మిఱుమిట్లు గొలిపే కాంతి క్షణికంగా కనిపిం

చింది. అది పిడుగుపాటని తెలిసే లోపు గానే 'అమ్మో, నాయనో!' అంటూ ఆ ముసలాయనా, ప్రభావతి స్పృహతప్పి పడిపోయారు.

ప్రభావతికి స్పృహ వచ్చేసరికి రాత్రి బాగా ప్రొద్దుపోయింది. విప రీతంగా చలిగాలి వీస్తోంది. ఆకాశంలో మెరుపులు కనిపిస్తున్నాయి. అంటే తానున్నది ఏదో బయలు ప్రదేశమన్న మాట. కేకలు, ఏడుపులు, జంతువుల అరుపులు, మూలుగులు వినిపిస్తు న్నాయి. చేతులకు ముళ్ళు గుచ్చుకుంటు న్నాయి. మెఱుపు వచ్చినప్పుడు బాగా చూస్తే తెలిసింది — తానొక ఈతచెట్టు మీద ఉన్నట్టు. క్రిందంతా నీటి ప్రవా హం! ఒక ముసలాయన్ను తాను వాటే సుకునుంది.

"ఏమండీ, మనమెక్కడున్నాం? మా నాన్నగారెక్కడున్నారు?" కంగారుగా అడిగిందామె.

"భయపడకమ్మా! అన్నిటికీ ఆ భగ వంతుడే వున్నాడు. ఉప్పెన పొంగు లోంచి మనల్ని యింతవరకు కాపాడు తూనే వచ్చాడు" అన్నాడు ఆ పెద్దాయన చలికి విపరీతంగా వణుకుతూ.

కాని వేలాది మనుష్యుల ఆర్త నాదాలు ఆ భగవంతునికి వినిపించడం లేదు. ఎక్కడ చూసినా కొట్టుకు పోతున్న జనాలు, తల్లి కౌగిలిలోంచి సడలిపోతున్న పసికందులు! దాహం లేకున్నా ఉప్పునీటితో పొట్టనిండిపోయి, గుండె ఆగిపోయి రబ్బరు బంతుల్లా తేలిపోతున్న శవాలు! దివిసీమలో నరకం వికటాట్టహాసం చేస్తోన్న దారుణ దుర్భర పరిస్థితి అది!

పట్టువదలని హోరుగాలికి ఆ ఈత చెట్టు కూలిపోయింది. 'అమ్మో, నాయనో!' అంటూ ఆ ముసలాయన పడిపోయాడు. ప్రభావతి కూడా నీటిలో పడిపోయింది.

రెండు పదులు దాటని ప్రభావతిలోని జవసత్వాలు పొంగి పొరిలాయి. మెఱు పులు చూపిన దృశ్యాన్నిబట్టి ఊరి బయట వున్న శివాలయానికి దగ్గర్లో ఉన్నట్టు గ్రహించింది. అంటే ఎత్తైన గుట్ట సమీపంలోనే ఉందన్నమాట. వెంటనే ఆ మనిషిని భుజాలపైన వేసు కుని ఈత రాకున్నా ఈదడానికి ప్రయ త్నం చేసింది. కాలికి ఏదో తగిలేసరికి అదే ఊతగా తీసుకొని ఒక చేతితో చుట్టూ తడిమి చూసింది. ఏటవాలుగా పడివున్న ఒక చెట్టును పట్టుకుని అలాగే నిలబడింది. గాలి ఉధృతం తగ్గి క్రమంగా నీటిమట్టంకూడా తగ్గుముఖం పట్టింది. నెమ్మ దిగా నీటిలో అడుగులు వేస్తూ ప్రభావతి గుట్ట చేరుకుంది. అప్పటికే చాలామంది అక్కడికి చేరుకున్నారు. ఆ ముసలా యనను కిందికి దించి బరువుగా నిట్టూ ర్చింది. ఏదోమైకం ఆమెను ఆవరించింది. కళ్ళు తిరిగి కింద పడిపోయింది.

బాగా తెల్లవారిన తర్వాత ప్రభావతికి మెలకువ వచ్చి కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుంది. పైటకొంగు చేతికి అందకపోవడంతో రెండు చేతుల్ని రొమ్ముకు అడ్డంగా వుంచుకుని చుట్టూ చూసింది. ఎటు చూసినా రోగులులాగ పడుకున్నవాళ్ళు, చుట్టూచేరి ఏడ్చేవాళ్ళు, డాక్టర్లు, నర్సులు—అంతా గోలగావుంది. ఎదురుగా ఎండవేసి చిత్తుగా చిరిగి పోయిన తన చీర, జాకెట్టును గమనించి తన వొంటిని ఒకసారి చూసుకుంది. ఒక పల్చటి టవలు తన ఛాతీ చుట్టూ బిగించి వుంది. ఒంటినిండా గాయాలు, బాధ. దగ్గరలోనే ఆ ముసలాయన కూడా స్పృహరాక పడివున్నాడు, పెంచలయ్య జాడలేదు.

ఐదురోజులు గడిచాయి. రోజూ ప్రభావతి గుట్టంతా తిరిగిరావడం, నాన్న పెంచలయ్య జాడ తెలియకపోవడం దిన పరి కార్యక్రమంగా జరుగుతోంది. తాను మోసుకొచ్చిన ముసలాయన పరిస్థితి క్షీణిస్తోంది. ఆయన పేరు రామశర్మ అని తెలిసింది. దగ్గరగావుండి ఆయనను తానే శ్రద్ధగా గమనించుకొంటూంది.

ఒకరోజు దూరంలో ఏదో కలవరం బయలుదేరింది. నీటిలో కొన్ని శవాలు కొట్టుకువచ్చి గుట్టకు దగ్గరలో పడి వున్నాయి. తమ వాళ్ళను పోగొట్టుకున్న వాళ్ళంతా అటువైపు పరుగెడుతున్నారు. ఆ సంగతి విని ప్రభావతి కూడా వెర్రి పరుగుతో అక్కడికి చేరింది.

అలా వెళ్ళిన ప్రభావతి మూడు రోజులదాకా తిరిగి రాలేదు.

తన తండ్రి శవానికి ఎవరో పుణ్యాత్ములు సంస్కారం చేశారు. ఇంక లోకంలో తన కెవరున్నారు? అందుకే ప్రభావతి తిరిగి రాలేదు.

"ఇలా ఎంతకాలం యిక్కడే వుంటావమ్మా?" పోయిన వాళ్ళను మనం తిరిగి తేగలమా? ధైర్యంగా వుండాలి. అన్నట్లు ఆ ముసలాయనకు స్పృహ వచ్చి రెండు రోజులైంది. డాక్టర్ నిన్ను రమ్మన్నాడు. వచ్చి చూడమ్మా" అని నర్స్ నచ్చచెప్పింది.

ఆలోచించే శక్తి ప్రభావతిలో నశించినా కొన్ని క్షణాలు మౌనంగా ఉండి, ఏదో నిర్ణయానికి వచ్చినట్లు "సరే మీరు పదండి. నేను వస్తాను" అని చెప్పింది. నర్స్ వెళ్ళిపోయింది.

"ప్రభా!" అన్న పిలుపు విని ప్రభావతి ప్రక్కకు చూసింది. అది పరిచితమైన కంఠం.

చేతిలో బ్రీఫ్ కేస్ పట్టుకొని భానుమూర్తి కనిపించాడు. ప్రభావతి చూపు మళ్ళించింది.

"ప్రభా! నిన్నే! ఇలా చూడు."

భానుమూర్తి మళ్ళీ పిలిచాడు.

"నన్ను మరచిపొమ్మన్నావుగా." తల దించుకొనే సమాధానమిచ్చింది ప్రభావతి.

"నా మాట నమ్ము ప్రభా! ఒక్క



విషయంలోనే మన పెళ్ళి మా నాన్న కిష్టంలేకపోయింది. కులాంతర వివాహం ఆయనకు నచ్చలేదు. పోనీ మీది హరిజనకులం కాదనీ, మా కులమే ననీ చెబుదామనుకుంటే నిజాయితీ అడ్డు వచ్చింది. నన్ను క్షమించు ప్రభా! మీ నాన్నతో కూడా చెప్పి క్షమాపణ కోరుకుంటాను."

"ఛీ, ఛీ! ప్రేమించటానికి పనికి వచ్చిన కులం పెళ్ళికి అడ్డం వచ్చిందా? నీలాంటి దగాకోరుతో మాట్లాడే ఖర్మ మా నాన్నకు పట్టలేదు. ఆయన హాయిగా కన్ను మూశారు." అంతవరకూ ధీమాగా మాట్లాడిన ప్రభావతి తలవంచి ఏడవటం ప్రారభించింది.

"సారీ ప్రభా! నా వంటి పాపాత్ము డుండకూడదు."

"అందుకే వెళ్ళిపొమ్మంటున్నాను."

భానుమూర్తి రెండుక్షణాలు మౌనంగా ఉండి, "సరే, వెళ్తున్నాను" అంటూ వెళ్ళిపోయాడు.

కొంతసేపటికి ప్రభావతి లేచి గుట్ట పైపు నడచి రామశర్మ దగ్గరకు చేరింది. మచం ప్రక్కన స్టూల్ మీద భానుమూర్తి కూర్చొని వున్నాడు. అతన్ని చూసిన ప్రభావతి విసుగ్గా "చూడు భానుమూర్తి! నన్నెందుకిలా వెంటాడుతున్నావ్? ఇంకా నాతో నీకేం పని?" అని అడిగింది.

"ఆ ప్రశ్న అడగాల్సింది నేను. నీ విక్కడి కెందుకొచ్చావ్?" తిరుగు ప్రశ్న వేశాడు భానుమూర్తి.

ఇదంతా చూస్తున్న రామశర్మ "ఎవర్రా, ఈ అమ్మాయి?" అని ప్రశ్నించాడు.

"ఈ అమ్మాయి సంగతే నాన్నా నేను మీకు చెప్పింది. ఈమె పేరే ప్రభావతి" అన్నాడు భానుమూర్తి.

"నాన్నా!" అన్న సంబోధన విని ప్రభావతి నిశ్చేష్టురాలైంది. పరిస్థితి నంతా క్షణంలో గ్రహించింది.

"ఓహో, అలాగా! చూడమ్మాయ్!

మా వాడి అదృష్టం బాగుంది కనుక సరి పోయింది. లేకపోతే మా సాంప్రదాయం గంగపాలై వుండేది. వెర్రివేషాలు మాని వచ్చిన దారినే వెళ్ళిపో!" అన్నాడు రామశర్మ.

ఎంత ప్రయత్నించినా ప్రభావతి ఆవేశం అణచుకో లేకపోయింది.

"ఏవండీ సంప్రదాయం? ప్రేమించ టానికి పనికొచ్చిన కులాన్ని పెళ్ళికి పనికి రాదనటం సంప్రదాయమా? నమ్మించి ఒక ఆడదాని గొంతుకోయడం కూడా ఒక సంప్రదాయమేనా?" అని రెట్టించి అడిగింది.

"ప్రభా! అనవసరంగా మా నాన్నను రెచ్చగొట్టకు! ఆయనకిప్పుడు విశ్రాంతి అవసరం. వెంటనే వెళ్ళిపో." గట్టిగా అన్నాడు భానుమూర్తి.

"నా అంతట నేను రాలేదు. డాక్టరు గారు రమ్మంటేనే వచ్చాను. అదిగో వస్తున్నారుగా, ఆయన్నే అడగండి" అని జవాబిచ్చింది ప్రభావతి.

అప్పుడే అక్కడికొచ్చిన డాక్టర్ ఆ ముసలాయన్ను చూసి,"రామశర్మగారూ! ఇందాక మీ రడిగింది ఈ అమ్మాయిని గురించే. ఈవిడే మిమ్మల్నిక్కడికి చేర్చింది" అన్నాడు.

రామశర్మ కొయ్యబారి కొన్నిక్షణాలు ప్రభావతి వైపు చూశాడు. "అంటే, ఆ తుఫానునాటి రాత్రి ...." అని అంటుండగా ప్రభావతి అందుకుంది.

"అవును నాటి రాత్రి మా యింట్లోనే మీరాగారు. ఎలాగో ప్రమాదం తప్పి ఇక్కడ చేరాము."

"అన్నట్టు! మీకు రక్తదానం చేసింది కూడా ఈవిడేనండీ! లేకపోతే మీ గ్రూప్ రక్తం మాకు దొరక్క తంటాలు పడివుండేవాళ్ళం" అని శ్రుతి కలిపాడు డాక్టరు.

ఇదంతా భానుమూర్తి నోరు తెరచు కొని చూస్తున్నాడు. రామశర్మ నుద్దే శించి ప్రభావతి "రామశర్మగారూ! పోతున్న మీ ప్రాణాన్ని నిలబెట్టిన నా రక్తానికెలాంటి సంప్రదాయం వుందం టారు? అది తప్పడంకన్నా ప్రాణదాన సంప్రదాయం తక్కువైందా? ఇప్పుడు నా రక్తం మీలో ప్రవహిస్తోంది. అంత మాత్రాన నా సంప్రదాయం మీకు వచ్చి నట్లేనా?" అని ఏకధాటిగా ప్రశ్నల వర్షం కురిపించింది.

"నాన్నా ఏమిటిదంతా?" కంగారుగా అడిగాడు భానుమూర్తి.

రామశర్మ కేమనాలో తోచ లేదు. చివరికాలోచించి "ఇందాక నీతో చెప్పా నుగా, దేవతలాంటి ఓ అమ్మాయి నన్ను కాపాడిందని—ఆవిడేరా ఈ ప్రభావతి!" అన్నాడు, అప్రయత్నంగా పొంగివచ్చిన ఆప్యాయతతో.

ఆయనలో నెమ్మదిగా కలుగుతున్న మార్పును గమనిస్తూ ప్రభావతి, "చూడండి రామశర్మగారూ! మానవత్వం




అన్నది మనసులో వుంటుంది కాని కుల మతాలలో కాదు" అంది.

నెమ్మదిగా లేచి రామశర్మ ప్రభావతి దగ్గరకొచ్చాడు. "అమ్మా! నన్ను క్షమించు. నాలోని మూఢాభిప్రాయాలను పటాపంచలు చేసావు. నీ కభ్యంతరం లేకపోతే నీవే నా కోడలు కావాలని కోరుతున్నాను" అన్నాడు. భానుమూర్తి కళ్ళు మెరిసాయి.

ప్రభావతి రెండడుగులు వెనక్కి వేస్తూ "ఆగండి. పెళ్ళిమాట ఇప్పుడ ప్రస్తుతం. అసలీ పెళ్ళికి ఒప్పుకోడానికి నేను సిద్ధంగా లేను నా కిష్టంలేదు. అయినా మా నాన్న ఆత్మశాంతి కోసం ఒప్పుకుని ఆయనకు నే నిచ్చిన మాట నిలబెట్టుకుంటాను. కాని యిప్పుడుకాదు. ఒకసారి మీ చుట్టూ చూడండి. ఎంత మంది అనాథలయ్యారో! వాళ్ళందరికీ శక్తివంచన లేకుండా సేవచేసి, అందరూ కుదుటపడ్డ తర్వాతే నా పెళ్ళి విషయం ఆలోచిస్తాను. అందుకు మీ కభ్యంతరం లేకపోతే నా కార్యక్రమంలో మీ అబ్బాయిని కూడా పాల్గొనమని చెప్పండి," అంటూ చూపును భానుమూర్తి వైపు త్రిప్పింది.

భానుమూర్తి ముందుకు నడిచాడు. దూరంగా చలికి వణుకుతున్న ఒక ముసలాయన దగ్గరఆగాడు. బ్రీఫ్ కేసులోనుంచి ఒక దుప్పటి తీసి ఆయనకు కప్పాడు. భానుమూర్తి వెనుక ప్రభావతి నడుస్తుంటే చూసి తృప్తిగా నిట్టూర్చాడు రామశర్మ, కులానికి తిలోదకాలిస్తూ.

———